ప్రజాశక్తి
గురువారం 17 నవంబర్ 2022
5
విజయనగరం

డిఇఒగా లింగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా విద్యా శాఖ అధికారిగా బి.లింగేశ్వరరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి డిఇఒ ఎఎం జయశ్రీ దీర్ఘ కాలిక సెలవు పెట్టడంతో పూర్తి అదనపు బాధ్యతలు విద్యా శాఖలో ఎడిగా ఉన్న వెంకటేశ్వరరావుకు అప్పగించారు. ఎట్టకేలకు అనకాపల్లి డిఇఒగా ఉన్న లింగేశ్వర రెడ్డిని నియమిస్తూ బుధవారం విద్యా శాఖ కమిషనర్ సురేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. లింగేశ్వర రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆరుగాలం శ్రమించి చెరకు సాగు చేసిన రైతులకు తీపి బదులు చేదే మిగులుతోంది. చెరకు పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన మద్దతు ధర ప్రకటించకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఉమ్మడి విజయనగరం జిల్లాలోని ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలు మూతపడడంతో వీటి పరిధిలోని రైతులు సంకిలి పారిస్ ఫ్యాక్టరీకి చెరకు తరలించాలని అధికారులు నిర్ణయించడంతో ఈ ఏడాది కూడా తిప్పలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం సంకిలి ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభం కానుంది.

సకాలంలో ఇవ్వని కటింగ్ అనుమతులు

కర్మాగారానికి చెరకును తరలించేందుకు సకాలంలో కటింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడంతో ఏటా ఇబ్బందులు పడుతున్నామని రైతులు అంటున్నారు. ఆయా ఫ్యాక్టరీల పరిధిలో సిబ్బంది కటింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడం ఒకటైతే, చెరకు కట్ చేసి కర్మాగారానికి సకాలంలో తరలించక పోవడంతో ఎండకు ఎండిపోయి బరువు తగ్గిపోయి నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

చెరకు రైతులకు చేదే..

- విత్తు నాటిన నుంచి సరఫరా చేసేవరకు కష్టాలే
- రైతులకు గుదిబండగా రవాణా ఛార్జీలు
- నేటి నుంచి సంకిలి కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-రేగిడి

జిల్లాలో సంకిలి, లచ్చయ్యపేటలోని ఎన్‌సిఎస్ సుగర్స్, భీమసింగి చక్కెర కర్మాగారం పరిధిలో ఈ ఏడాది లక్షా 43, 644 ఎకరాల్లో 10, 484 మంది రైతులు చెరకు సాగు చేశారు. 5,53,103 టన్నుల చెరకు దిగుబడి వస్తుందని అంచనా. ఉమ్మడి జిల్లాలోని ప్రధానమైన భీమసింగి సహకార కర్మాగారం, లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ మూతపడడంతో రైతులంతా తమకు చెరకు సంకిలి తరలించాల్సి ఉంది. అయితే రైతులకు రవాణా, అదనపు ఛార్జీలు గుదిబండగా మారనున్నాయి.

భీమసింగి, ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో పది తూనిక కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో ఈ రెండు కర్మాగారాల పరిధి 35 కిలోమీటర్ల లోపు ఉండడంతో ఛార్జీలను ఆయా ఫ్యాక్టరీలే భరించేవి. అయితే రెండేళ్లగా సంకిలికి తరలించాల్సి రావడంతో రవాణాఛార్జీలు రైతులకు భారంగా మారుతున్నాయి. మరోవైపు యాజమాన్యం మద్దతు ధర పూర్తిస్థాయిలో ప్రకటించకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. విత్తనం నాటిన నుంచి ఏడాది పొడుగునా పండించిన చెరకు కర్మాగారానికి సరఫరా చేసే అంతవరకు పెట్టుబడులు ఎకరానికి రూ40వేలు నుంచి రూ.50వేలు వరకు ఖర్చవుతోంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టినా కూలీలు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం చెరకుటన్ను

సుగర్ ఫ్యాక్టరీ	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (టన్నుల్లో)	రైతులు
ఎన్‌సిఎస్	5,830	1.20లక్షలు	3600
భీమసింగి	814	20,103	434
సంకిలి	1.37లక్షలు	4.13లక్షలు	6,450

మద్దతు ధర రూ.3,050 రూపాయలకు ప్రకటించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,700కు తగ్గించి ప్రకటించింది. సంకిలి యాజమాన్యం టన్ను చెరకు మద్దతు ధర ఈ ఏడాది 2,980 రూపాయలు ప్రకటించడంతో కూలీల ఖర్చులకే రావడం లేదని ఆవేదం చెందుతున్నారు. పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో సరైన మద్దతు ధర ప్రకటించకపోవడం అన్యాయమని అంటున్నారు.

గిట్టుబాటు ధర లేక అప్పుల పాలు

చెరకు సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నాం. చెరకు సాగు ప్రారంభం నుంచి అన్నింటికీ పెట్టుబడులు పెరిగాయి. కూలి, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఏడాది పాటు చెరకు పంటలు పండిస్తే మదుపులకే రావడం లేదు. దీంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం.

\- బాన్న హరినాథ్, చెరకు రైతు, సంకిలి

మద్దతుధర రూ.3500 ప్రకటించాలి

ఏటా పెరుగుతున్న పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని చెరకు రైతులకు టన్ను చెరకు మద్దతు ధర 3,500 రూపాయలు ఇవ్వాలి. యాజమాన్యం కూడా దిగుబడులను దృష్టిలో పెట్టుకొని రాయితీలు ప్రకటించడం విడ్డూరం. యాజమాన్యం రైతులు ఆదుకోవాలి.

\- బూసి అనంతరావు, చెరకు రైతు, ఖండ్యాం గ్రామం

రైతులను ఆదుకుంటాం

చెరకు రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏడాది చెరకుటన్ను మద్దతు ధర పెంచుతున్నాం. చెరకు రైతులు సాగు విస్తీర్ణం పెంచేందుకు భారీ రాయితీలు ప్రకటిస్తున్నాం. దిగుబడులు పెంచేందుకు శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తున్నాం. దిగుబడులు వస్తే రైతుకు ఆర్థికంగా కష్టాల నుంచి బయటపడతారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా సిడిఒలకు నేరుగా కర్మాగారానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. చెరకు సరఫరాకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేశాం.

\- ఎ.నాగశేషారెడ్డి, ప్యారీ సుగర్స్ ఉపాధ్యక్షులు, సంకిలి

శ్మశానవాటిక నిర్మాణపనులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

శ్మశాన వాటిక నిర్మాణాన్ని పరిశీలించిన బృందం

- కమిషనర్‌కు నివేదిస్తామన్న కమిటీ సభ్యులు
- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలిలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన శ్మశాన వాటిక నిర్మాణం పూర్తి కాకుండానే రూ.6.50 లక్షలు బిల్లు జనరేట్ అయ్యింది. ఈ విషయమై ప్రజాశక్తిలో 'బాధ్యతా రాహిత్యామా.. బరితెగింపా' అనే శీర్షికన ఈ ఏడాది మే 13న వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దానిపై స్పందించిన పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ విచారణ నిమిత్తం నలుగురు సభ్యులతో కూడిన బృందాన్ని పరిశీలనకు నియమించారు. కమిటీలో వైవివి వరప్రసాద్ (సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి)తో పాటు ఎం. నాగరాజు (సోషల్ ఆడిట్), డి. కళ్యాణ చక్రవర్తి (జూనియర్ కంట్రోల్ అధికారి), లక్ష్మీకాంత్ (సిఆర్‌డి అకౌంటెంట్) ఉన్నారు. వీరంతా బుధవారం వైవివి వరప్రసాద్ అధ్యర్యంలో కుమిలి శ్మశాన వాటికను పరిశీలించారు. ఎంత వరకూ పని జరిగిందన్న దానిపై కొలతలు వేశారు. ఎంత పని జరిగింది?. ఎంత వరకూ ఎం-బుక్ రికార్డు చేశారు? అన్న అంశాలను ఎపిఒ కనక రాజును అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా లేని సమస్య ఈ మండలంలోనే ఎందుకు వస్తుందని కమిటీ సభ్యులు ఆయనను ప్రశ్నించారు. ఎందుకు పని పూర్తి కాకుండా ఎందుకు బిల్ జనరేట్ చేసారన్నది అడిగి తెలుసుకుంటామన్నారు. విచారణ నివేదికను కమిషనర్‌కు అందజేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు అక్కడకు చేరుకొని మండలంలోని మరిన్ని ప్రాంతాల్లో జరిగే పనుల్లో అక్రమాలు జరిగాయంటూ ఆయనకు పిర్యాదు చేశారు. అక్కడకు వచ్చి పరిశీలించాలని కోరారు. దాంతో ఆయన స్పందించి ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందించి కమిషనర్ ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చామన్నారు. మీ ఫిర్యాదులు ఏమైనా ఉంటే కలెక్టర్, కమిషనర్‌కు తెలియజేయా లన్నారు. ఇప్పుడు శ్మశాన వాటిక మాత్రమే తనిఖీ చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజాశక్తిలో వచ్చిన కథనం (ఫైల్)

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి. శ్రీకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఎస్‌బిసిసి ఆధ్వర్యంలో గురజాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యంతో చదువులో పరుగులు తీయాల న్నారు. సాదాసీదా చదువులు ఉన్నత స్థానానికి తీసుకెళ్లలేవని స్పష్టం చేశారు. తాను ఖరగ్‌పూర్ ఐఐటిలో కంప్యూటర్ సైన్స్‌లో బిటెక్ పూర్తి చేసినప్పటికీ దాంతో సంతృప్తి చెందక గ్రూప్ 1 పరీక్ష రాసి డిప్యూటీ కలెక్టర్‌గా శిక్షణ పొందుతున్నానని వివరించారు. మనం ఎంత బాగా చదువు నేర్చుకుంటే అంత మంచి స్థానం సంపాదించ గలమని ఉద్బోధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నారు. క్రీడలు, వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ కర్త బి.రామకృష్ణ, పాఠశాల కరెస్పాండెంట్ ఎం.స్వరూపారాణి, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ శ్రీకర్

నోడల్ ఆఫీసర్ గా జయకృష్ణ ఎంపిక

ప్రజాశక్తి-వంగర

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఆంగ్ల పుస్తక రచయిత యస్. జయకృష్ణ మన్యం జిల్లా స్పోకెన్ ఇంగ్లీష్ నోడల్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ప్రతాపరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జయకృష్ణ ఎంపిక కావడంపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రమణమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

పాలిటెక్నిక్ కోర్సులతో యువతకు ఉపాధి

- రీజనల్ పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభంలో కలెక్టర్
- ఆలోచింపజేసిన విజ్ఞాన ప్రదర్శనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాలిటెక్నిక్ కోర్సుల ద్వారా యువతకు తక్షణ ఉపాధి లభిస్తుందని కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. ఇక్కడ నేర్పించే లైఫ్ స్కిల్స్ జీవితంలో త్వరగా స్థిరపడేందుకు దోహదపడతాయని అన్నారు. సంప్రదాయ కోర్సులకు భిన్నంగా ఉండే కరిక్యులమ్ వల్ల విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకొనే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించబోయే రీజినల్ పాలిటెక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని బెలూన్ల ఎగురవేసి మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి, కళాశాల ప్రిన్సిపాల్ ఆశా రమణిలతో కలిసి కలెక్టర్ సూర్యకుమారి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంప్రదాయ కోర్సులకు భిన్నంగా ఉండే పాలిటెక్నిక్ వంటి కోర్సుల ద్వారా త్వరితగతిన ఉపాధి లభిస్తుందని, ఇక్కడ నేర్పించే అంశాలను మనసు పెట్టి నేర్చుకొని జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఇంజినీర్లు కావడానికి పాలిటెక్నిక్ ఒక చక్కని వేదిక అని పేర్కొన్నారు. యువతకు సామాజిక స్పృహ కూడా ఉండాలని, రాజకీయ అంశాల్లో పరిజ్ఞానం కూడా ముఖ్యమే అని పేర్కొంటూ విద్యార్థులు ఓటు హక్కుకోసం నమోదు చేసుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలకు ఇద్దరు బిఎల్ఒలను పంపించి ఓటు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అక్కడ నుంచే అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత రాజకీయాల్లోకి రావాలని, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఫెస్ట్‌లో భాగంగా జిల్లాలోని 22 ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థులు వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పవర్ మేనేజ్‌మెంట్ సిస్టం, సోలార్ సిస్టం, వర్షపు నీరు పొదుపు, సైక్లింగ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి తయారు చేయుట వంటి పలు అంశాలపై విద్యార్థులు ప్రయోగాత్మక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో రెండో డివిజన్ కార్పొరేటర్ సత్య గౌరి, కళాశాల ప్రిన్సిపాల్ జె. ఆశా రమణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బెలూన్లు ఎగురవేసి ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, మేయర్, డిప్యూటీ మేయర్

కాలుష్యం లేకుండా ఉపాధి కల్పించండి

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో కొండలావేరు గ్రామంలో సర్వే నెంబర్ 1పిలో మెస్సర్స్ కోస్టల్ మినరల్స్, ముద్దునూరు రామరాజు ఆర్. సత్యనారాయణరాజు క్వార్ట్జ్ తవ్వకం గురించి జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం గ్రామంలో చేపట్టారు.ఈ కార్యక్రమంలో కొండలావేరు పంచాయతీలోని భగీరథ పురం, బాడం ప్రజలు మాట్లాడుతూ తవ్వకాల వల్ల వచ్చే కాలుష్యంతో మొక్కలకు, చుట్టూ పక్కల వున్న ప్రజలకు ఏవిధమైన ప్రమాదం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటే తమకు ఎటువంటి అభ్యంతరమూ లేదన్నారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమం వల్ల తమ మూడు గ్రామాలకు చెందిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించాలని, తమ జీవన ప్రమాణలను మెరుగు పరచాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నివారణ ఇంజినీరు సుదర్శనరావు, కంపెనీ యాజమాన్యం ప్రతినిధులు రామరాజు, మండల నాయకులు తాడ్డి వేణుగోపాల రావు, ఎస్‌వి రమణ రాజు, కోట్ల వెంకటరావు, తహశీల్దార్ బి. రత్నకుమార్, బుధరాయవలస ఎస్ఐ నవీన్ పడాల్, వైద్య సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థులు

సభలో మాట్లాడుతున్న గ్రామస్తుడు

టిడిపి నగర ప్రధాన కార్యదర్శిగా బంగారుబాబు

పజాశక్తి-విజయనగరం కోట

టిడిపి విజయనగరం ప్రధాన కార్యదర్శిగా ఆల్తి బంగారుబాబు నియమితులయ్యారు. బుధవారం అశోక్‌బంగ్లాలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు , నియోజకవర్గ ఇంచార్జి అదితి గజపతి ఈమేరకు ఆయన పేరును ప్రకటించారు. అందరినీ కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కమిటీ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, ఉపాధ్యక్షులు పైడిరాజు, కోశాధికారి రాజపాతూరి రమేష్ కుమార్ (చినబాబు), కార్యనిర్వాహక కార్యదర్శులు షేక్ మస్తాన్ వలి (మనోహర్), పెనుమత్స శ్రీనివాసరాజు, గొల్లకోటి శివప్రసాద్, కార్యదర్శులు పెంటకోట సత్యనారాయణ, అర్జి అప్పలరాజు, కాళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

సత్య కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు.కళాశాల ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, జిల్లా ప్రభుత్వాసుపత్రి బ్లడ్‌బ్యాంకు సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని సత్య విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ, సత్య విద్యాసంస్థల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ్ రావు ప్రారంభించారు. 63 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఏటా తమ విద్యాసంస్థల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఉంటామని,ఎక్కడ అవసరమైతే అక్కడకు మా విద్యార్థులు వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ఉంటారని తెలిపారు. అందుకు చాలా గర్వంగా ఉందని విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. శశిభూషణ్ రావు మాట్లాడుతూ మనం ఇచ్చిన రక్తం వల్ల కొన్ని ప్రాణాలను నిలబెట్టిన వారమవుతామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న ఝాన్సీలక్ష్మి, శశిభూషణరావు

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

ప్రజాశక్తి-విజయనగరంకోట

పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వాన్ని విజ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చని జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ కుమారి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చూసి నేర్చుకునే దాని కన్నా పుస్తకాన్ని చదివి నేర్చుకోవడం ద్వారా అభివృద్ధి కాగలమని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత మాట్లాడుతూ మీ ఖాళీ సమయాల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవచ్చని, సభ్యత్వం తీసుకుని పుస్తకాలను ఇంటికి కూడా తీసుకువెళ్లవచ్చునిని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటి ఉద్యమ ఫలితమే నేటి గ్రంథాలయాలు

నాటి ఉద్యమకారుల కృషి ఫలితమే నేటి గ్రంథాలయాలు అని గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు తెలిపారు. బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు, నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలకు ముఖ్యఅతిథిగా నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మోహిదు నారాయణరావు హాజరై పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక విద్యార్థి గ్రంథాలయాలను రోజులో ఒకసారైనా లేదా వారంలో రెండు రోజులైనా సందర్శించి మంచి మంచి పుస్తకాలు చదివి, విజ్ఞానాన్ని వికాసాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. కార్యాలయంలో లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు.

గాజులరేగలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పూల్‌బాగ్‌లో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక పూల్‌బాగ్ ఏరియాలోని రెండు, నాలుగో డివిజన్ల పరిధిలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి బుధవారం పర్యటించారు. ప్రభుత్వ సేవలు, ఓటు నమోదు ప్రక్రియ, ఇతర అంశాలపై స్థానికులతో మాట్లాడారు. పలువురి ఇళ్లకు స్వయంగా వెళ్లి వారితో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు, సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఓటు నమోదు విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే స్థానికంగా బిఎల్ఒ అందుబాటులో ఉంటారని, వారిని సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక మంగళవీధి కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మహిళా సంఘాలతో సమావేశం

నెల్లిమర్ల : స్థానిక వైకెపి కార్యాలయంలో గ్రామ సమాఖ్య సంఘాలతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏరియా కో ఆర్డినేటర్ జి. సీతారామయ్య మాట్లాడుతూ సంఘాల సమావేశాలు సక్రమంగా జరగాలని, అన్ని సంఘాలు ఏ గ్రేడులో నిలిచి బ్యాంకు లింకేజి రుణాలు, స్త్రీనిధి రుణాలు టార్గెట్లు పూర్తి చేసి వసూళ్ల శత శాతం జరగాలని సూచించారు. పిఎంఈజిపి, పిఎఫ్ఎంఈ, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్, బ్యాంకు యార్డ్ పౌల్ట్రీ రుణాలు టార్గెట్ల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గరివిడి ఏరియా స్త్రీ నిధి మేనేజర్ వై. ఎర్రి నాయుడు, డిజిఎం దుర్గా ప్రసాద్, ఎస్‌విపి ఎపిఎం పద్మావతి, స్థానిక ఎపిఎం ఎల్. సత్యనారాయణ, సీసీలు 30 మంది గ్రామైఖ్య సంఘం అధ్యక్షులు, విఒఎ పాల్గొన్నారు.

కాలువ భూములపై గ్రామ సభ

మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్

వేపాడ : మండలంలో కరక వలస, కృష్ణరాజ పురం గ్రామాలలో బుధవారం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పోలవరం కాలువ నిర్మాణం పనులపై గ్రామసభలు ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాల రైతులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చి కాలువ నిర్మాణం చేపట్టాలని కోరారు. మార్పు చేయకపోతే రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభలలో రైతులు తెలిపిన సూచనలను జిల్లా అధికారులకు నివేదిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్ తెలిపారు. ఈ సమావేశంలో డిఇ, ఎఇలతో పాటు తహశీల్దార్ కృష్ణంరాజు, ఆర్ఐ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

శృంగవరపుకోట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మధ్యాహ్నం విద్యార్థులకు పెట్టే భోజనాలను బుధవారం పరిశీలించారు, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం ప్రతిరోజు రుచికరమైన వంటలను చేసి విద్యార్థులకు పెట్టాలని హెచ్ఎంను కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకుడు చెలికాని ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులకు పని కల్పించాల్సిందే

గజపతినగరం: వేతనదారులందరికీ పని కల్పించాల్సిందేనని ఎపిఒ సిహెచ్ రామారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో పనులను గుర్తించాలని, వేతనదారుల ఆధార్ కార్డు నెంబర్లు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, వారి సంఖ్యను కూడా పెంచాలని అన్నారు. సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

జరజాపుపేటలో టిడిపి మాటా మంతి

నెల్లిమర్ల : నగర పంచాయతి పరిధి జరజాపు పేటలో టిడిపి శ్రేణులు మాటా మంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి మహిళలతో మాట్లాడుతూ అధికార వైసిపి మహిళల పట్ల వివక్ష చూపి ప్రభుత్వ పథకాలు అమలులో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ముఖ్యంగా అర్హులకు అమ్మఒడి, పింఛన్లు, చేయూత జగనన్న కాలనీ వంటి పథకాలు లేనిపోని ఆంక్షలతో అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి అధికార వైసిపికి మహిళలే తగిన బుద్ధి చెప్పి గద్దె దించుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కార్యదర్శి అనురాధ బేగం, పత్తి గుళ్ల సూర్య కుమారి, నగర పంచాయతి పట్టణ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి లీలావతి, నాయకులు కింతాడ కళావతి, అవనాపు రమణమ్మ, లెంక హైమావతి, నరవ రామ లక్ష్మి, పొడుగు కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శృంగవరపుకోట : గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో పెదఖండేపల్లి రహదారిలో గల కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ లైబ్రరీ (సెల్) ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని శాంతినికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.దివాకరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జియో వ్యవస్థాపకులు బి.రామకృష్ణ పాల్గొన్నారు.

గడువులోగా రైతు భరోసా కేంద్రం పూర్తి

రేగిడి: గడువులోగా రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించి అన్ని అంగులతో అందించాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు సూచించారు. కొమిరి గ్రామంలో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రూ.24.14 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈయనతో పాటు మండల ఇంజనీరింగ్ అధికారి రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి కేశవరావు, జగన్ ఉన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఈ నెల 18న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపిఒడి బిఎస్‌కె పట్నాయక్ బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

భోగాపురం : మండలంలోని ముంజేరు పంచాయతీ పిట్టపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులను వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ బుధవారం పరామర్శించారు. ఒక్కో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, దుస్తులు, 6 రకాలు నిత్యవసర సరుకులు, వంట పాత్రలు పంపిణీ చేశారు. అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూడి నూకరాజు, మాజీ ఎంపిటిసి పిడుగు రాంబాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక

భోగాపురం: సిఎం కప్పుకు నియోజకవర్గం స్థాయి క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు క్రికెట్ ఇంచార్జ్ లీలా కృష్ణ తెలిపారు. నాలుగు మండలాల నుంచి సుమారు 40 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారని వీరిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశామని చెప్పారు. వీరంతా రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొంటారని అన్నారు.

రక్తదాతలకు ప్రశంసా పత్రాలు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్ క్రాస్, ఎన్.ఎస్.ఎస్ యూనిట్, ఎన్‌సిసి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా రక్తదానం చేసిన విద్యార్థులకు రెడ్‌క్రాస్ జిల్లా ప్రతినిధులు బుధవారం ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేశవ రావు మాట్లాడుతూ, అన్ని దానాలు కన్నా రక్తదానం గొప్పదని రక్తదానం చేసిన విద్యార్థులను ప్రశంసించారు. రక్తదానం చేసిన వారందరికీ రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ చేతులు మీదగా ప్రశంస పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు సూర్యారావు, గౌరి శంకర్ వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ రావు, వాసుదేవరావు, జయలక్ష్మి, భాస్కర్, యూత్ రెడ్ క్రాస్, ఎన్.ఎస్-ఎస్ కోఆర్డినేటర్ బి. సంధ్యారాణి, శ్రీనివాసురావు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలుగుబిల్లిలో ఉచిత పశువైద్య శిబిరం

శృంగవరపుకోట : మండలంలో ఆలుగుబిల్లి గ్రామంలో పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ బి. చలపతిరావు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పశువుల గర్భకోశ వ్యాధులకు, చూడి తనిఖీలు, చూడుకి రాని తిరిగి పొర్లు తున్న, సాదారణ వ్యాధులతో బాధపడుతున్న పశువులకు చికిత్స అందించారు. అనంతరం ఆరోగ్య సమస్యలు పశువులలో గుర్తించి వాటిని అరికట్టే విదంగా రైతులకు సూచనలు చేశారు. అనంతరం పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలు రాయితీపై అందించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాదికారి డా.జి.హేమ, పశు సంవర్ధక సహాయకులు, ఎంపిటిసి శేఖర్ రావు, సర్పంచ్ బోని ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ బి వెంకటరావు పాల్గొన్నారు.

18న వాలీబాల్ జట్టు ఎంపికలు

భోగాపురం: సిఎం కప్ ప్రైజ్‌మనీ వాలీబాల్ టోర్నమెంట్‌కి సంబంధించి నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడాకారుల బాలురు, బాలికలు జట్లు ఎంపికలు ఈ నెల 18న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భోగాపురం క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వాలీబాల్ ఇంచార్జ్ యస్. నాగన్న తెలిపారు. ఈ ఎంపికలకు 17 ఏళ్లు నిండిన వారు మాత్రమే అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు జెరాక్స్, ఒక పాస్ ఫోటో తీసుకొని రావాలన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో శాఖా గ్రంథాలయాల్లో బుధవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగాయి. పలుచోట్ల గ్రంథాలయ ఉద్యమ కారుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కొన్ని గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించారు..

ప్రజాశక్తి- బొబ్బిలి

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులైన గ్రంథాలయ పితామహులు రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణంలను స్మరించుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత తహశీల్దార్ లంక వెంకట స్వామి, విశ్రాంత ఉపాధ్యాయులు మరిచర్ల సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి వెంకట రమణ, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ సేవలు మరువలేనివని గ్రంథాలయ

బొబ్బిలి: పుస్తకాలను తిలకిస్తున్న విశ్రాంత తహశీల్దార్, తదితరులు

ఎస్‌కోట: గ్రంథాలయ ఉద్యమ కారుల ఫోటోలు వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నిర్వాహకులు పి.లక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సంధర్భంగా గ్రంథాలయ ఉద్యమ నాయకులను స్మరించుకుంటూ చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు.

శృంగవరపుకోట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పట్టణంలో గల శాఖ గ్రంథాలయ అధికారిని బి. లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయల అభివృద్ధి కృషి చేసిన గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకున్నారు.

గుర్ల: శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ బి. కామేశ్వర రావు ఉద్యమ కారుల గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు రామారావు, కామేశ్వరావు, జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ లైబ్రేరియన్ ఎస్ సోమనాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆ పాఠశాలకు చెందిన 6,7,8,9,10వ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

బాడంగి : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పత్రికా విలేకర్లకు బుధవారం సన్మానం చేశారు. ఇందులో భాగంగా గ్రంథాలయ ఉద్యమ నాయకుల సేవలను స్మరించుకుని వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, సర్పంచ్ కండి రమేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్రినాథరావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు

నెల్లిమర్ల: గ్రంథాలయ ఉద్యమ కారుల ఫోటోలు వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

సకల సౌకర్యాలతో జగనన్న కాలనీలు

ప్రజాశక్తి- బొబ్బిలి

జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం దగ్గర నుంచి పేద ప్రజల జీవనశైలికి కావలసిన అన్ని సకల సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. బుధవారం పట్టణానికి సమీపంలో ఉన్న జగనన్న కాలనీలు, టిడ్కో గృహ సముదాయాలను మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఎలక్ట్రికల్ ట్రాన్సఫార్మర్లు దొంగతనానికి గురికావడంతో లేఅవుట్‌లో ఉన్న బోర్లు పనిచేయక ఇబ్బంది ఉందని ఎమ్మెల్యే శంబంగికి తెలియజేశారు. ఇలాంటి పనులు చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకునేలా పోలీస్ సిబ్బందితో మాట్లాడి దర్యాప్తు జరిపించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావుకు సూచించారు. జగనన్న కాలనీలో ఇల్లు నిర్మాణంతో పాటు రోడ్లు, డ్రైనేజీలు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనసేన నాయకులు ఉపయోగించే అసభ్య పదజాలంతో ఓటు బ్యాంకింగ్ పెరగదని అలాంటి మాటలు

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తమ ఉనికిని కాపాడుకోవడానికి తప్ప ఎలాంటి రాజకీయ ప్రయోజనం చేకూరదని విమర్శించారు. టిడ్కో ఇళ్లను కూడా మార్చి నెలలో లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సారి పల్లి గ్రామాభివృద్ధికి సహకరించాలని మాజీ సర్పంచ్ రాయి విభీషణ రావు కోరారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడును తన నివాసంలో కలిసి గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి పత్రాన్ని అందించారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగు నీరు అందించాలని కోరారు. గ్రామంలో రహాదారి, విరిగిన విద్యుత్ పోల్స్ స్థానంలో కొత్త స్థంబాలు వేయాలని, ప్రభుత్వ భవనాల కోసం స్థలం ఇచ్చిన రైతులకు స్థలాలు ఇప్పించాలని, సామాజిక భవనం నిర్మించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధించిన అధికారులతో మాట్లాడి టెండర్‌లో ఉన్న పనులు అన్ని జరిగేలా చూడాలని ఆదేశాలు జారీ చేసినట్లు మాజీ సర్పంచ్ రాయి విభీషణ రావు తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న సారిపల్లి గ్రామస్తులు

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో బుధవారం ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీలో తయారు చేసిన మొక్కలను లబ్ధిదారులకు ఎంపిపి డి. సత్యంతుడు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కె పట్నాయక్, వైయస్సార్ కాంతి పథకం ఎపిఎం శ్రీనివాస రావు, ఎపిఒ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపిపి సత్యవంతుడు

పాఠశాలలు పరిశీలన

అనంతరం ఆయన మండలంలోని డిఆర్‌పేట పాఠశాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా విద్యార్థులను ఉపాధ్యాయులను బోధన విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఎంపిపితో పాటు వల్లంపూడి వైయస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడి రాంబాబు, గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం దబ్బిరాజుపేట పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సత్తిబాబు, నాయకులు చామంతల గంగాధర్, దండుపాటి సత్తిబాబు, వల్లంపూడి వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, ప్రధానోపాధ్యాయుల రెడ్డి శంకర్రావు, తాడి రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

ఇసుక దందాపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

లక్కవరపుకోట: మండలంలోని వీరభద్రపురం గ్రామ పంచాయతీలో ఉన్న మొగదారి గెడ్డలో రాత్రిం బవళ్లు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని స్థానిక తహశీల్దార్ తామరపల్లి రామకృష్ణకు అదే గ్రామస్తులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ గెడ్డలో ఇసుక తరలించడం వల్ల 600 ఎకరాల ఆయకట్టుకు నీరందించే వీరముకుందసాగరం చెరువు అడుగంటి పోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామ పంచాయతీలో ఉన్న ప్రజలకు తాగునీరు అందించే 70 బోర్లకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇదే విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యమని విచారం వెలిబుచ్చారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమస్యను తెలపడంతో ఇసుకను తరలించిన బళ్లను తక్షణమే సీజ్ చేయాలని తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంతవరకు పట్టించుకోలేదని ఆవేదన చెందారు. ఇసుకను అక్రమంగా తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామంలో దండోరా వేయించినట్లు తహశీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో పోతల గురువులు, యేడువాక జగన్నాధరావు, పిన్నింటి అర్జున, కన్నంరెడ్డి సన్యాసిరావు, పోకల రాము, ఎవర్న రామారావు, ఉల్లి పాండురంగ, నెలిపూడి శ్రీను తదితరులు ఉన్నారు.

ఆటోలు అప్రమత్తంగా నడపాలి

రామభద్రపురం : ఆటోలు అప్రమత్తంగా నడిపి ప్రమాదరహిత సమాజానికి కృషి చేయాలని సిఐ తిరుమలరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రహదారి భద్రతకు పెద్ద పీట వేయాలని సూచించారు. స్కూల్ జోన్ల వద్ద విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా వేగ నియంత్రణ పాటిస్తూ సౌండ్ పొల్యూషన్ లేకుండా చూసుకోవా లన్నారు. పరిమితికి మించి వేగం, సరకు రవాణా నేరమన్నారు. నిషేధిత వస్తువులు రవాణా చేయరాదని, అట్టి వస్తు రవాణా చేసే వారి వివరాలు తెలియజేయాలని కోరారు.

రైతుశిక్షణ తరగతులను జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు

ప్రజాశక్తి - జామి

ఈ నెల 23,24,25 తేదీల్లో విశాఖలో జరిగే, రైతు శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం జామి మండల కేంద్రంలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ రంగం – సహకార సంఘాల పాత్ర అనే అంశంపై మూడు రోజుల పాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతున్న ఈ నేపథ్యంలో రైతులు పట్ల ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై అవగాహన అవసరమని అన్నారు. అనంతరం జామి మండల రైతు సంఘం ఏర్పాటుకు సంబంధించి, కార్యవర్గ ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

మండల కమిటీ సభ్యులు వీరే..

ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సిరికి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల కమిటీ ఏర్పడింది. అధ్యక్షులుగా చుక్క రామకృష్ణ, కార్యదర్శిగా కొత్తల వెంకటరావు, సహయ కార్యదర్శిగా విసినిగిరి రవి, ఉపాధ్యక్షులుగా చుక్క రామకృష్ణ, కోశాధికారిగా చలుమూరి వెంకటరావు, సభ్యులు వవల రెడ్డి వెంకటరమణ, శీర కృష్ణ, సిరికి వెంకటరావులను ఎన్నుకున్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలు బలోపేతం కావాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

రైతు ఉత్పత్తి సంఘాలు బలోపేతం కావాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి జమదగ్ని తెలిపారు. బుధవారం మండలంలోని చౌడువాడ పంచాయితీ పరిధిలో గల కృష్ణాపురంలో పైడితల్లమ్మ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంలు బలోపేతమై సంఘం యొక్క ఆర్థిక కార్యాకలపాలు జాగ్రత్తగా నిర్వహించుకోవాలన్నారు. సంఘాల ద్వారా ప్రభుత్వ రాయితీలు పొందుతే రైతులు అవసరమైన కొబ్బరి గిట్టుబాటు ధరలు, అవసరమైన అన్ని రకాలు కొబ్బరి ఉత్పాదక సంఘాలుగా ఏర్పాటు కావాలని వివరించారు. కొబ్బరి తోటల్లో ఆశించే సర్పిలాకార్ తెల్లదోమ యొక్క లక్షణాలు, వాటి యొక్క నివారణ చర్యలు గూర్చి వివరించారు. చౌడువాడ, గోవిందపురం, వెల్లూరు, వెంపడాం గ్రామాల్లో కొబ్బరితోట బడి, కుమిలి గ్రామంలో మామిడి తోటబడి నిర్వహిస్తున్నామని చెప్పారు, ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉద్యానవన అధికారి జమదగ్ని

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. అక్కివరం సచివాలయం పరిధిలోని పల్లెవారి కల్లాలు, గొల్ల పేట గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఆయన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం పల్లెవారి కల్లాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ లైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, గ్రామ సర్పంచ్ కిరణ్, బాలి సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

లక్కవరపుకోట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బీమాలి పంచాయతీలో స్థానిక ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

డెంకాడ: మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిష్కారం కానీ సమస్యలు ఏవైనా ఉంటే వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి , భీమాలి ఎంపిటిసి శ్రీనురాజు , సర్పంచ్ కొయ్యాన కృష్ణ , చందులూరు ఎంపిటిసి యడ్ల కిషోర్ కుమార్ , వైసిపి సీనియర్ నాయకులు జగ్గందొర, కొట్యాడ మహేష్ , యర్ర శ్రీనివాసరావు , ఆదిరెడ్డి అర్జున , గణేష్ ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొత్తవలస

బొబ్బిలిలో డిసెంబరు 3,4 తేదీల్లో జరగనున్న ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక ఎస్‌సి బాలుర వసతి గృహంలో మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ ఎస్ఎఫ్.ఐ నిరంతరం విద్యారంగంలో వస్తున్న మార్పులు, వాటి వల్ల వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మండల నాయకులు జోసెఫ్, మూర్తి, లోకపతి తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: ఎస్ఎఫ్ఐ 30వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి జె. రవికుమార్ పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల పోస్టర్‌ను భోగాపురం మండల కేంద్రంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 3,4 తేదీలలో బొబ్బిలిలో జిల్లా మహాసభలు జరుపుతున్నామని, వీటికి జిల్లా వ్యాప్తంగా రెండు వందలమంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పావని, నాయకులు రవి విద్యార్థులు పాల్గొన్నారు.

వసాదిలో 70 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని పెద్ద మజ్జి పాలెం ఆరోగ్య కేంద్రం పరిధిలో వసాధి గ్రామంలోని డాక్టర్ ఆర్ఆర్ జగదీష్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం సందర్భంగా బుధవారం 70 మందికి వైద్య సేవలు అందించారు. 14 రకాల పరీక్షలు నిర్వహించి 67 రకాల మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉండాలని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్యం పైన అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే ఉన్నత స్థాయి చదువులకు ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌతమ్, ఈవో ప్రభాకర్, ఆరోగ్య సహాయకులు ఈశ్వరరావు, ఎంఎల్‌హెచ్ పి. కృష్ణవేణి, ఏఎన్ఎం నారాయణమ్మ, పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న వైద్యులు

పిహెచ్‌సిని పరిశీలించిన ఎంపిపి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఎంపిపి గేదెల శ్రీనివాసరావు బుధవారం స్థానిక పిహెచ్‌సితో పాటు నిర్మాణంలో ఉన్న 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మీటింగ్ హాల్ వంటివి పరిశీలించారు. తొలుత పిహెచ్‌సిలో గల ఫార్మసీ, ల్యాబ్ సందర్శించారు. అన్ని రకాల రోగాలకు సంబంధించిన మందులు పూర్తిస్థాయిలో ఉన్నాయా..? లేవా అని..? వైద్యాధికారి పివి మురళీ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సికి వచ్చిన రోగులకు సక్రమంగా వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. నాడు – నేడు నిధుల నుండి రూ. 1.65కోట్ల అంచనా విలువతో 2020 సెప్టెంబర్ 29న ప్రారంభించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణం పనులు ప్రారంభించి రెండేళ్లు గడిచినప్పటికీ నేటి వరకు పూర్తి చేయక పోవడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్చినాటి కల్లా ఆసుపత్రి భవన నిర్మాణం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు.



వైద్యునితో మాట్లాడుతున్న ఎంపిపి గేదెల శ్రీనివాసరావు

అనంతరం స్లాబ్ లెవెల్ వరకు వచ్చి అర్ధాంతరంగా ఆగిపోయిన మీటింగ్ హాలు భవనం పనులు మరేదైనా నిధులు కేటాయించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొట్యాడ పంచాయతీ సర్పంచ్ కొట్యాడ మహేష్, మండల కో ఆప్షన్ నెంబర్ షేక్ ఖాసిం, ఎల్ కోట మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ జామి అప్పలరాజు, వైసిపి నాయకులు కూరాకుల సూర్యారావు, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.